# కనీస వేతన చట్టాన్ని ఎత్తివేసే ప్రయత్నాలలో

# బడాపెట్టుబడిదారీవర్గంతో కుమ్మక్కైన దేశ పాలకులు

**మన** 'స్వతంత్ర' దేశాన్ని 'మన పాలకులు' పాలించటం ప్రారంభమైన 69 సంవత్సరాల తర్వాత కూడా; మన ఆర్థికవ్యవస్థను పరిగణించదగిన అభివృద్ధి దిశగా నడిపిస్తాయని, అగ్రరాజ్యాల సరసన మనదేశాన్ని నిలబెడతాయని ప్రకటించిన నయా ఉదారవాద పెట్టుబడిదారీ ఆర్థిక విధానాల, సంస్కరణల అమలు ప్రారంభమై 25 సం॥లు గడిచిన తర్వాత కూడా – మనదేశంలో కార్మికులకు కనీసవేతనాలను చెల్లించట మనేది, ఓ ఎండమావిగానే మిగిలిపోయింది.

పాలకులు, బడాపారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు కూడా కనీస వేతన దృక్పధాన్ని ఆమోదించేందుకు, కనీస వేతనాల చెల్లింపులోనున్న న్యాయబద్ధమైన అంశాన్ని అంగీకరించేందుకు అది చట్టబద్ధమైన ఆదేశమైనప్పటికీ నిరాకరిస్తున్నారు.

వాస్తవానికి ప్రపంచ ఆర్థిక, సామాజిక అభివృద్ధి గురించి ఊదరగొడ్తున్న ఈ 21వ శతాబ్దపు ఆధునిక కాలంలో మనదేశంలోని కార్మికులంతా జీవన వేతనాలను పొందాల్సి వుంది. అయితే, జీవన వేతనాలను ప్రక్కనుంచినా, మనదేశ కార్మికులకు సమంజసమైన వేతనాలు కూడా లభించటంలేదు. కార్మికులకు కనీస వేతనాన్ని మాత్రమే డిమాండ్ చేయగలస్థితిలో నేటి మనదేశ కార్మికోద్యమ స్థితి వుంది. ఈ కనీసపాటి డిమాండ్‌ను కూడా పారిశ్రామికవేత్తలు వివిధ కారణాలతో నిరాకరిస్తూవస్తోన్నారు.

మనదేశంలో దాదాపు 40 కోట్లమంది కార్మికులుంటే, వారిలో 90శాతం కార్మికులు–అనియత, అసంఘటిత రంగాలలో ఏవిధమైన చట్టబద్ధ సౌకర్యాలూ రక్షణలూ లేకుండా, కనీస అవసరాలను తీర్చుకోవటానికి, తమను, తమ కుటుంబసభ్యులను పోషించుకునేందుకు అవసరమైన కనీసవేతనాలు కూడా లేకుండా బ్రతుకులీడుస్తున్నారు.

వ్యవస్థీకృత మరియు సాంప్రదాయ కార్మిక యూనియన్ల నాయకత్వం ఇచ్చిన సెప్టెంబర్ 2 సార్వత్రిక సమ్మె పిలుపు సందర్భంగా పేర్కొన్న డిమాండ్లలో, దేశవ్యాపితంగా కనీసవేతనాన్ని 15వేల రూ॥లుగా ప్రకటించాలనే ఒక డిమాండు వుంది. ఈ నేపధ్యంలో కార్పొరేటు ప్రసార మాధ్యమాలలో కనీసవేతనాలపై అనేకమంది ఆర్థికవేత్తలు, ప్రత్యేక నిపుణులు, హెచ్.ఆర్. మేనేజర్లు, మరియు సంపాదకులనేకమంది చర్చల్లో పాల్గొని అనేక వాదనలు ముందుకు తెచ్చారు. తమ పాండిత్య ప్రకర్షను ప్రదర్శిస్తూ, నయా ఉదారవాద పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ దృక్కోణంతో ఎక్కువమంది వాదనలు చేశారు. మనదేశంలో సార్వత్రిక కనీస వేతనాల చెల్లింపు అనేది ఆచరణయోగ్యంకాదని, సాధ్యమూకాదని, పొరపాటు ఆలోచనని వారు తమ వాదనలలో పేర్కొన్నారు. కార్మికుడనేవాడు ఒక ప్రాణమున్న మనిషని, ఆతనిపై కుటుంబసభ్యులందరూ ఆధారపడివున్నారని, వారి విద్య, వైద్యం, బట్టలు తదితర కనీస అవసరాలకు వారు ఆ కార్మికునిపై ఆధారపడి వుంటారని; భవిష్యత్తు లేబర్ మార్కెట్ అవసరాల కనుగుణమైన పిల్లలకు శ్రామికుడు జన్మనివ్వాల్సి వుంటుందనే అంశాల్ని ఈ చర్చల్లో పాల్గొన్న వారంతా పరిగణలోకే తీసుకోకుండా, చాలా తక్కువగా అంచనా వేస్తూ మాట్లాడారు. మార్కెట్ ఆర్థికవ్యవస్థలో, మార్కెట్‌లో హెచ్చుతగ్గులపై ఆధారపడిన మార్కెట్ సరుకుగా మాత్రమే వారు కార్మికుని పరిగణిస్తున్నారు.

వాస్తవానికి, మనదేశంలో కార్మికవర్గం సుదీర్ఘకాలం సాగించిన పోరాటాల ఫలితంగా, 1957లో జరిగిన 15వ భారత కార్మికసదస్సు కనీస వేతనాలను నిర్ధారించేందుకు ఒక సూత్రాన్ని రూపొందిస్తూ, ఈ దిగువ అంశాలను పరిగణలోకి తీసుకోవలసివుంటుందని చెబుతూ వాటిని తప్పక అమలుపర్చాల్సిన అంశాలుగా పేర్కొంది. 1. మూడు వినియోగ ప్రమాణాలకు అనుగుణంగా కనీసవేతనం వుండాలి. 2. ఒకరోజుకు 2,700 క్యాలరీల శక్తిగల ఆహారాన్ని సమకూర్చుకో గలగాలి. 3. కార్మికుని కుటుంబానికి అవసరమైన 72 గజాల బట్టల అవసరాన్ని తీర్చగలగాలి. 4. సబ్సిడీపై అందించే గృహవసతి లేదా దానికి సమానమైన గృహవసతికి చెల్లించవలసిన అద్దె సమకూర్చుకోగల్గాలి. 5. కనీస వేతనంలో 20 శాతం ఇంధనం, విద్యుత్తు మరియు ఇతర అనేకానేక అవసరాలను తీర్చగలగాలి. కార్మికుల బిడ్డల విద్య, వైద్య అవసరాలు తదితరాలను జోడిస్తూ కనీసవేతనం గురించి పైన పేర్కొన్న లెక్కకు 1991లో, సుప్రీంకోర్టు మరో 25 శాతం వేతనాన్ని కలపాలని ఆదేశించింది. కానీ కనీస అవసరాలలో అనేకమార్పులు చోటుచేసుకున్న ప్రస్తుత కాలంలో, ముందంజవేసిన, అభివృద్ధి సాధించిన మరింత నాగరీకమైన వాతావరణంలో కనీస వేతనాలను మరింతగా పెంచాల్సిన అవసరముంది. అది ఖచ్చితంగా లెక్కలేస్తే నెలకు 22,000 రూ॥గా వుంటుంది. కనుక, కార్మికుడిని ఓ వ్యాపార వస్తువుగా కాకుండా ఓ మానవునిగా పరిగణిస్తే, ఇదీ కార్మికుని కనీసవేతనాన్ని లెక్క వేయటంలో తప్పనిసరిగా అవలంబించాల్సిన సూత్రబద్ధమైన అవగాహనగా వుంటుంది.

అయితే, మన పాలకులు ఒక పద్ధతి ప్రకారం ఈ అవగాహనను పూర్తిగా తుడిచిపెడ్తూ, క్రమంగా కనీసవేతనాలను నిర్ణయించే వ్యవస్థనే ఎత్తివేయ జూస్తున్నారు. ప్రభుత్వాలకుగాక మార్కెట్టుకే నియంత్రణాధికారాలు కలిగివుండే నయాఉదారవాద ఆర్థిక విధానాలను, సంస్కరణలను పాలకులు అమలు చేస్తున్నప్పటినుండి ప్రపంచ స్వేచ్ఛావాణిజ్యంలో సామర్థ్యాన్ని, పోటీతత్వాన్ని నిలిపివుంచే విధంగా విలువను నిర్ణయించటంతో కనీస వేతన చట్టాన్ని రద్దుచేయ తలపెట్టారు. చట్టబద్ధమైన కనీస వేతనాలను చెల్లించటానికి కూడా పారిశ్రామిక యాజమాన్యాలు అభ్యంతరాలు తెలుపుతూ వస్తున్నాయి. ప్రభుత్వం కూడా వారి వాదనలతో ఏకీభవిస్తూ, వాటికి తలూపుతూ వస్తోంది. 'మేక్ ఇన్ ఇండియా' నినాదాన్ని ప్రభుత్వం చేబట్టిన తర్వాత చైనా, వియత్నాం, కంబోడియా, బంగ్లాదేశ్‌లలో

చౌకగా లభించే శ్రమశక్తికంటే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడికి మనదేశంలో మరింత కారుచౌకైన శ్రమశక్తిని సమకూర్చటానికి సంసిద్ధమైంది.

సెప్టెంబర్ 2 సమ్మె పిలుపును ఉపసంహరింపజేసే చర్యల్లో భాగంగా ఎన్‌డిఏ ప్రభుత్వం కనీస వేతనాన్ని కేవలం నెలకు 10,000 రూ॥గా నిర్ధారిస్తానంటూ ముందుకు వచ్చింది.

అయితే, పారిశ్రామిక యాజమాన్య సంఘాలైన ఎఫ్ఐసిసిఐ వంటి వాటి నుండి ఎదురైన తీవ్ర అభ్యంతరాలతో కాంట్రాక్టు కార్మికులకు నెలకు పదివేల రూ॥ల కనీసవేతనాన్ని నిర్ణయించే తమ నిర్ణయాన్ని నిలిపివేసిన కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ, వేతనాల నిర్ధారణ అంశమేదో అంతర్జాతీయ పరిధిలోదైనట్టు, అంతర్జాతీయస్థాయి నిపుణులు తేల్చవలసిన అపరిష్కృత సమస్య అయినట్టు "అంతర్జాతీయ సంప్రదింపులు" సాగించే విధానాన్ని "ఎంచుకుంది". ఇది గమనించిన ఎవరైనా మనదేశం సార్వభౌమదేశమని, మన ప్రభుత్వాలు సార్వభౌమాధికారం కలిగిన ప్రభుత్వాలంటే ఫకాలున నవ్వుతారు.

మనదేశ పాలకులు–ప్రత్యేకించి ఎన్‌డిఏ ప్రభుత్వం 'అంతర్జాతీయ ఖ్యాతి' గురించి గౌరవ ప్రపత్తులతో మాట్లాడుతూ, దానిపై ఆధారపడుతూ కూడా 1970లో జరిగిన ఐక్యరాజ్యసమితి 131వ సమావేశాలలో ఆమోదించిన కనీస వేతన నిర్ధారణ సూత్రాలకు ఈనాటికీ సర్వామోదాన్ని తెలపలేదు. (ఐక్యరాజ్యసమితిలో తాను ఓ ప్రాముఖ్యత కలిగిన సభ్యదేశమని గొప్పలు చెప్పుకుంటూ కూడా)

2016 సెప్టెంబర్ 17, 18 తేదీలలో 'బిజినెస్ స్టాండర్డు' పత్రిక తన సంపాదకీయంలో జాతీయస్థాయిలో కనీసవేతనాన్ని 15,000 రూ. పెంచాలనే నిర్ణయం చాలా పొరపాటైనదిగా పేర్కొంది. అలాంటి ఒక నిర్ణయమే గనుక జరిగితే దిగువ పేర్కొనే విపరిణామాలు సంభవిస్తాయని చెప్పింది: ఎ) కనీసవేతన పెంపుదల అనే ఆ మార్పు, చట్టాల పుస్తకాలకు మాత్రమే పరిమిత మౌతుంది; మార్కెట్‌లో అమలుకు మాత్రం నోచుకోదు. బి) 'కార్మికులను పనిలో పెట్టుకోవటం సాధ్యమైనంతవరకు ఎలా తగ్గించగలం? లేదా యంత్రాలను ఎక్కువగా ఏవిధంగా వాడగలం' అని అత్యధిక సంఖ్యలో యజమానులు ఆలోచన చేస్తారు. సి) కేరళలో సాగించే వరిసాగు, కొబ్బరిపీచు ఉత్పత్తులు వంటి అనేక పనులు అధిక వేతనాల చెల్లింపుతో గిట్టుబాటుకాకుండా పోయాయి. డి) 15,000 రూ॥ల కనీసవేతనంగా నిర్ణయిస్తే, ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఏర్పడవు.

కార్మికులకు ఉపాధి కల్పించే ఏకైక లక్ష్యంతో మాత్రమే పరిశ్రమలు మరియు వాణిజ్య, వ్యాపారసంస్థలు తమ సంస్థలను నడుపుతున్నట్లు, 'సూపర్ లాభాలు' సాధించుకోవటం కోసంమాత్రం కాదన్నట్లుగా 'బిజినెస్ స్టాండర్డు' సంపాదకుడు ఇచ్చిన తెలివైన సలహా, ఓ భ్రమను ప్రచారంలో పెడుతున్నది. పారిశ్రామిక యజమానులు తమ ఉత్పత్తి పెంపు కోసం విడిభాగాల యితర ముడివస్తువుల ధరలు పెరిగిన మేర వాటికి చెల్లిస్తున్నారు. కానీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించటానికి మాత్రం వారు సిద్ధంకాకుండా, ఉత్పత్తి ఖర్చులను తగ్గించాలనే పేరుతో అత్యంత తక్కువ వేతనాలతో కార్మికుల శ్రమను కొల్లగొడుతూ, వారి శ్రమశక్తిని దోచుకుంటున్నారు. తిరిగి మరలా ఉత్పత్తి ఖర్చు తగ్గింపు పేరుతోనే, ఉత్పత్తిని పెంపు చేసుకొని లాభాలు గడించేందుకు పారిశ్రామిక యజమానులు యాంత్రీకరణ చేపడుతున్నారు. కనుక, పారిశ్రామిక యజమానులు దయ, జాలితో కార్మికులకు ఎట్టి పరిస్థితుల్లోనూ పని కల్పించరని స్పష్టమౌతోంది. లాభసాటి అయిన యంత్రాలు అందుబాటులో వుంటే, కార్మికుల పట్ల దయా దాక్షిణ్యాలతో పారిశ్రామిక యజమానులు అటువైపు మరలకుండా ఆగరు. కనుక, పై సంపాదకీయపు సలహాలోని రెండు పార్శ్వాలను గమనిస్తే, ఆ సలహా ఊహాజనిత అంశాలపై ఆధారపడి వాస్తవాన్నుండి దృష్టిని మళ్ళించటానికి ఉద్దేశించిందిగా అర్థమౌతుంది. వరిసాగు లేదా కొబ్బరిపీచు ఉత్పత్తులు గిట్టుబాటు కాకపోవటానికి ప్రధానమైన, ప్రాథమికమైన కారణం కనీస వేతనాల పెంపుసమస్య కాకపోగా, ఇతర అనేక కారణాలున్నాయి; వాటిని ప్రత్యేకంగా చర్చించాలి. అయితే, ఆ ప్రత్యేక అనుభవాన్ని యావద్దేశంలోని పారిశ్రామికరంగాలన్నింటికీ సాధారణీకరించి వర్తింప జేయటమంటే, కార్మికుల కనీసవేతన సూత్రాన్ని, అవగాహనను నిరాకరించటమే.

కనీస వేతనాలను నిర్ధారించటంలో కనీస మౌలిక అవసరాల దృక్పథం వంటి అత్యావశ్యక అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. మనదేశంలో భిన్న రాష్ట్రాల నడుమ అసమానతలు, తేడాలు ఉన్నప్పటికీ, కనీస ఆహార వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు, విద్యా, వైద్య వ్యయాలు మాత్రం ఒకే స్థాయిలో వున్నాయి. అలాగాకుంటే, చట్టబద్ధమైన ఆదేశిత అవగాహనకు మరియు కనీస వేతనాన్ని నిర్ణయించే సూత్రాల పారామీటర్స్ యొక్క అవసరమేముంది? ప్రస్తుత కాలంలో నిరంతరం పెరుగుతున్న సరుకుల, సేవల ధరల స్థాయికనుగుణంగా కార్మికులకు కనీస వేతనాలను నిర్ణయించటానికి మార్కెట్ వ్యవస్థ హెచ్చు తగ్గులతో ఎలాంటి నిమిత్తం వుండరాదు.

కొందరు 'నిపుణులు' వ్యాఖ్యానిస్తున్నట్లుగా 'కార్మిక అంశం' రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అంశమైనప్పటికీ జాతీయ కనీసవేతనాన్ని నిర్ధారించి, కార్మికులకు చెల్లించటంలో ఎలాంటి అభ్యంతరం ఉండాల్సిన అవసరంలేదు.

పాలకులు మరియు ప్రభుత్వాలు ప్రతిపాదిస్తున్న కార్మిక సంస్కరణలు ఇప్పటికే కార్మికులకు చట్టపరమైన భద్రతను బలహీనం చేస్తున్నాయి. కనీస వేతనాల దృక్పథానికున్న చట్టబద్ధపునాదినే రద్దుచేసే ఏ ప్రయత్నమైనా, మనదేశ కార్మికవర్గం యొక్క జీవితాలను నాశనం చేస్తుంది.

కార్మికులు ఏవిధంగా మానవులుగా సైతం చూడబడటంలేదో, వారు మార్కెట్ ఆర్థికవ్యవస్థ అదుపులో సరుకులుగా ఏవిధంగా పరిగణింపబడుతున్నారో ఈ విషయాలు స్పష్టం చేస్తున్నాయి. ఆ కారణంగానే పాలకులు, పారిశ్రామిక యాజమాన్యాలు చట్టం నిర్దేశించిన, న్యాయసమ్మతమైన కనీస వేతనాలను నిర్ధారించటానికి నిరాకరిస్తున్నారు.

మనదేశ కార్మికోద్యమం, కార్మికులు – కనీసవేతన చట్టాన్ని రద్దుచేసే మన పాలకుల ప్రయత్నాలను వ్యతిరేకించి ఐక్యంగా నిలకడైన పోరాటాల్ని సాగించటంతోపాటు, రాబోయేరోజుల్లో జీవన వేతనాల సాధనకోసం నిశ్చయాత్మకంగా పోరాడాలి.

OOOOOO